

కథ

బి.వి.ఆర్



కథా నిలయం
శ్రీకాకుళం

# శీలం-స్పర్శ

"అమృతం శీలవతేనా కాదా?"

గభాల్న తలుపు తోసుకుని లోనికొచ్చి కుర్చీలో కూర్చుంటూ సుధాకరం అడిగిన ప్రశ్న ఇది.

అప్పుడే కాస్తంత టీ కాసుకుని తాగి సిగరెట్టంటించుకుని కూర్చున్నాడు శంకరం, గదిలో.

బుచ్చిబాబునవల 'చివరికి మిగిలేది'లోని అమృతం గురించి మాట్లాడుతున్నాడు సుధాకరం అని అర్థమయింది శంకరానికి.

పుస్తకాలు చదివొచ్చి ఇలాంటి ప్రశ్న లేస్తుండడం సుధాకరానికి అలవాటే.

శంకరం దగ్గర్నుంచే పుస్తకాలు పట్టుకెళ్తుంటాడతను. పట్టుకెళ్లిన రెండు మూడురోజుల తరువాత... ఇదిగో... ఇలా ప్రత్యక్షమవుతూంటాడు యక్షప్రశ్న ల్లాంటి ప్రశ్నల్తో.

"ఇప్పుడూ..." అని మొదలెట్ట బోయాడు శంకరం నింపాదిగా.

"ఆ సుత్తంతా నాకొద్దు. అవునా, కాదా... ఈ రెండిట్లో ఒకటి... ఒక్క మాటలో చెప్పాలి" అన్నాడు సుధాకరం విసుగ్గా.

వీడికెందుకో గాని ఈ మధ్య వినే ఓపిక బొత్తిగా తగ్గిపోతోంది-అనుకున్నాడు మనసులో శంకరం.

"అట్టాగంటే ఎట్టా మావా... ప్రతిదానికీ అంత దూకుడైతే ఎట్టా?"

అన్నాడు పొగ వదుల్తూ... అదో మాదిరి బుజ్జగింపు యాసతో.

"ఆ నాన్చుడే వొద్దు. తొరగా తేల్చేయ్. నాకవతల బోల్డు పనుంది" అన్నాడు ఇంకొంత విసుగ్గా సుధాకరం.

"నీ వాలకం జూస్తా ఉంటే, వెనకటికో ఇంగ్లీషు ముసలాయాన చెప్పినట్టు, మనిషికి ఒక బలమైన బలహీనత ఉందిట... అదేంటంటే, ఏదైనా విషయం మంచో, చెడో, ఒహడు జేసిన పని మంచిదో, కాదో, ఒహడు నడిచిన దారి సరైనదో, కాదో... ఇలా అదో ఇదో... ఈ రెండిట్లో ఏదో ఒహటి కచ్చితంగా అయి తీరాలనీ, మరో విధంగా అవడానికి వీల్లేదనీ తీర్మానించుకు కూర్చోజూడడంట. జీవితం అన్నాకా కచ్చితంగా తేల్చి చెప్పటానికి వీలుపడని సిచ్యుఏషన్సు బోల్డుంటైరా బాబూ!"

అని గబగబా అనేసి గుక్క తిప్పుకున్నాడు శంకరం.

"నీ బొంద. నీ వల్లగాదని చెప్పరాదూ!" అనేసి వచ్చినంత దూకుడుగానూ వెళ్లిపోయాడు సుధాకరం.

"ఒరేయ్ ఆగరా..." అని అరవబోయిన శంకరం

అగిపోయాడు, సుధాకరం ఆగేమనిషి కాదని తెలిసి.

## 2

చదువుకునే రోజుల్నుంచే కాస్తకాస్తగా 'పుస్తకాలు' చదవడం అలవాటైంది శంకరానికి. వయసు పెరిగే కొలదీ ఆ అలవాటూ పెరుగుతూ వచ్చిందే తప్ప తరిగింది లేదు. రోజువారీ జీవితం లోంచి అక్షరాల్ని తొలగిస్తే అంతాక్షరమై ఇక మిగిలేదేమీ లేదను కుంటుంటాడతను.

పుస్తకాలూ, పుస్తకాల్లోని వ్యక్తులూ, అతనికి ప్రియాతి ప్రియమైన మిత్రులుగా అనిపిస్తారు.

మచ్చుకి, 'క్రీడాభిరామం'లోని గోవిందమంచనశర్మ కల్పితవ్యక్తి లాకాక, కాకతీయుల కాలంలో ఓరుగంటి దరిదాపుల్లో ఎక్కడో పుట్టి పెరిగిన వ్యక్తిలాగా అనిపిస్తాడు.

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం- ఎ.ఐ.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో సాధారణప్రచురణకు స్వీకరించిన కథ**

"డౌన్ టు ఎర్త్ రొమాంటిక్ అంటే వాడేరా బాబూ... తెలుగు సాహిత్యంలో అతగాణ్ని మించిన రొమాంటిక్ పర్సనాలిటీ మరోడు గనపడ్డు నాకు" అంటాడు శంకరం బల్ల గుద్ది చెప్పినట్లు.

అంత పొగడ్తనీ నీతిమాలిన రొమాన్సుగా కొట్టిపారేస్తాడు సుధాకరం. అలాంటి చోట్లే మొదలయ్యేది ఇద్దరి మధ్యా వాదం.

మనిషన్నాక ఒక నీతికి కట్టుబడి ఉండాలనీ, కట్టు బడంది నీతి మాలిందే అవుతుందనీ అంటాడు సుధాకరం.

ఇద్దరూ సమవయస్కులు. విశాఖపట్టణంలో ఒకే ప్రభుత్వాఫీసులో పని చేస్తున్నారు.

సుధాకరం వాళ్లది విశాఖపట్టణమే.

వాళ్ల ఇంట్లోనే మేడ మీద ఒక చిన్న గదిలో అద్దెకుంటున్నాడు శంకరం.

సీతమ్మ ధారలో ఇల్లు. ఎన్ఎడి కొత్త రోడ్డు దగ్గర ఆఫీసు.

ఇద్దరూ కలిసే వెళ్లి వస్తుంటారు ఆఫీసుకు శంకరం స్కూటరుపై.

## 3

శ్రీశ్రీ 'అనంతం' (ఆత్మ చారిత్రాత్మకనవల), అబ్బూరి వరదరాజేశ్వరరావు 'కవనకుతూహలం'-ఈ రెండు పుస్తకాలు చదివిన ఎవరికైనా విశాఖపట్టణాన్ని వీలయితే వాటేసుకుని ముద్దుపెట్టుకోవాలనిపిస్తుంది, తెలుగు సాహిత్యంలో లబ్ధప్రతిష్ఠు లైన ఎందరికో ఆశ్రయం ఇచ్చినందుకు.

విశాఖలో వెలసిన ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇందుక్కొంత కారణం కావచ్చు.

విశాఖపట్నంలో ఉద్యోగం అనేప్పటికి అప్పటికే ఆరెండు పుస్తకాలూ చదివున్న శంకరానికి పట్టరానంత ఆనందం వేసింది. ఎగురుకుంటూ వచ్చి ఉద్యోగంలో చేరాడు. ఆ తరువాత రెండ్రోజులకి అదే ఆఫీసులో సుధాకరం కూడ ఉద్యోగంలో చేరాడు. ఇద్దరి మధ్యా సహజంగానే మిత్రత్వం నెలకొంది. తలదాచుకొందుకు నీడ కోసం వెతుక్కుంటూన్న శంకరాన్ని ఇంటికి తీసుకువెళ్లి మేడ మీది గది అద్దెకు ఇప్పించాడు సుధాకరం.

శంకరం సహవాసంలో సుధాకరానికి అచ్చిన కొత్త అలవాటు పుస్తకపఠనం. ఉద్యోగంలో చేరడానికి వస్తూ తనతో పాటు తెచ్చుకున్న 'కవనకుతూహలం' పుస్తకాన్ని చదవమని ఇచ్చాడు సుధాకరానికి, శంకరం.

పుస్తకం చదివిన సుధాకరం "మా వూరు ఇంత గొప్ప ఊరా... నాకింతవరకూ ఎలా తెలీలేదబ్బా!" అని ఆశ్చర్యం ప్రకటించాడు.

## 4

ఉద్యోగంలో చేరేనాటికి శంకరానికి ఇరవై మూడేళ్ల వయసు. ఉద్యోగంలో చేరిన కొత్తదనం పోయి, అందులో కొంత నిలదొక్కు కుని తన కాళ్ల మీద తాను నిలబడగలిగానన్న నమ్మకం, జీవితా నికి ఇక ఢోకా లేదన్న ధీమా కలిగాక, ఒక సరసురాలైన స్త్రీతో ప్రేమలో పడాలని కోరిక కలిగింది శంకరానికి.

అన్ని తరగతుల ఉద్యోగులూ కలిసి నూట ఇరవైమంది దాకా పని చేస్తున్న ఆఫీసు వాళ్లది.

అందులో మూడోవంతు స్త్రీ ఉద్యోగులు. అందరూ వివాహితలే, ఒక్కరు తప్ప. ఆమె పేరు వనజ. శంకరం కంటె ఒక సంవత్సరం సీనియరు. వేతనాల విభాగంలో ఆమె ఉద్యోగం ఎల్‌డిసి.

చూపులకు అందంగానే కనిపించింది శంకరానికి. సంవత్సరం సీనియారిటీ పెద్ద సమస్య కాబోదని ఓ రోజు పని కట్టుకుని వెళ్లి పలకరించా డామెను. స్నేహంగానే మాట్లాడిందామె.

ఆ ఉత్సాహంతో ఆ రోజు నుంచీ టీ విరామసమయంలోనూ, భోజనవిరామసమయంలోనూ వీలు కల్పించుకుని వెళ్లి ఆమెను కలిసి మాట్లాడడం మొదలెట్టాడు.

పరిచయం ఓ మోస్తరుగా పెరిగి, అన్ని విషయాలూ బిడియమూ, బెరుకూ లేకుండా మాట్లాడుకునే కలివిడి ఇద్దరి మధ్యా అమరినాక, ఒక రోజు పుస్తకపఠనం వైపు సంభాషణ మళ్లించాడు సుధాకరం.

'ఖాళీ సమయాల్లో ఏం జేస్తుంటారు? పుస్తకాలు చదువుతూంటారా?' అని తనక్కావలసిన సమాధానాన్ని ప్రశ్నగా అడిగాడు.

"ఆ... అప్పుడప్పుడూ" అందివనజ.

"చివరకు మిగిలేది చదివారా?" అని అడిగాడు.

"అంటే వేదాంత పుస్తకాలు కాదు... కాస్త మామూలు తరహాలో ఉండే నవల్సు లాంటివైతే చదువుతాను" అందామె.

"వేదాంతం పుస్తకం కాదండీ అదీ...



బుచ్చిబాబుగారి నవల" అన్నాడు గట్టిగా శంకరం.

"ఓ అదా... విన్నాను. కానీ చదవలేదు" అంది వనజ

మర్రోజు తన దగ్గరున్న ఆ పుస్తకాన్ని తీసుకెళ్లి ఆమెకిచ్చాడు చదివి ఎలాగుందో చెప్పమంటూ.

ఆపై రెండ్రోజులు గడిచాక, మూడోరోజు ఆ పుస్తకాన్ని ఆమె తిరిగి ఇచ్చేస్తున్నప్పుడు అడిగాడు శంకరం, "అప్పుడే చదివేశారా? ఎలాగుందీ?" అని.

"బాగానే ఉంది" అంది వనజ.

ముక్తసరి సమాధానంలా అనిపించింది శంకరానికి. ఆ పుస్తకంపై సంభాషణ అంత పేలవంగా ఆగిపోవడం నచ్చలేదు శంకరానికి. సుధాకరం పిచ్చి ప్రశ్న స్ఫురణకు వచ్చి, "ఈ మధ్యనే ఈ పుస్తకాన్ని చదివిన నా మిత్రుడొకడు ఒక ప్రశ్న వేశాడు" అన్నాడు.

ఏమిటా ప్రశ్న అన్నట్లుగా చూసింది వనజ.

"అమృతం శీలవతేనా కాదా? అని" అన్నాడు శంకరం.

పకాలున నవ్వబోయి ప్రయత్నం మీద నవ్వునాపుకొని, "మంచి ప్రశ్నే!" అంది వనజ.

"మీరేం చేప్తారు?" అన్నాడు శంకరం.

"మీరేం చెప్పారేంటి?" ఎదురు ప్రశ్న వేసింది వనజ.

"అది నేను చెప్తే మీరూ అదే చెప్తారు మొహమాటానికైనా... మీ అభిప్రాయం ఏంటో చెబుదురూ..." అన్నాడు శంకరం.

"నేనెంత మొహమాటపడే వ్యక్తిని కాదుగాని... రేపు మాట్లాడు కుందాం లెండి" అంటూ వెళ్లిపోయింది వనజ. తను పని చేస్తున్న సెక్షన్‌లోకి నమయాతీతమవుతాండదం గమనించినదానిలా.

## 5

మర్రోజు

ఆమె ఆఫీసుకు రాలేదు.

ఆ మర్రోజు

భోజనవిరామసమయం (లంచ్ టైం) లో వెళ్లి కలిశాడామెను శంకరం.

"నిన్న ఆఫీసుకు రాలేదు?" అన్నాడు ప్రశ్నార్థకంగా.

"అవును..." అందామె.

ఇంకా ఏదో సమాధానం కోసం అన్నట్లు ఏం మాట్లాడ లేదు శంకరం.

"నిన్న నా పెండ్లి చూపులు" కొంత తడవాగి చెప్పింది వనజ.

ఒకింత ఆశ్చర్యపోయాడు ఆ కారణానికి. అవక్కయ్యాడు కూడా. అయినా వెంటనే తేరుకుని ఆనందాన్ని మొహానికి పులుముకుని, "చెప్పరేం మరి... మరి మీకు నచ్చాడా?" అన్నాడు మాటలు తడబడుతూండగా.

అర్థం గానట్లుగా శంకరం వైపు ఒక చూపు చూసి, నింపాదిగా, "నాకు నచ్చుదం నచ్చకపోవడం అనేదేముంది? నేనతనికి నచ్చితే, నాకూ అతను నచ్చినట్లే కదా!" అందామె.

"నిన్న నా పెండ్లి చూపులు" కొంత తడవాగి చెప్పింది వనజ.
ఒకింత ఆశ్చర్యపోయాడు ఆ కారణానికి. అవక్కయ్యాడు కూడా. అయినా వెంటనే తేరుకుని ఆనందాన్ని మొహానికి పులుముకుని, "చెప్పరేం మరి... మరి మీకు నచ్చాడా?" అన్నాడు మాటలు తడబడుతూండగా.
అర్థం గానట్లుగా శంకరం వైపు ఒక చూపు చూసి, నింపాదిగా, "నాకు నచ్చదం నచ్చకపోవడం అనేదేముంది? నేనతనికి నచ్చితే, నాకూ అతను నచ్చినట్లే కదా!" అందామె.

వనజ ముక్కుసూటి రీజనింగుకి కాస్త కంగారు పడ్డాడు శంకరం. "అది కొంత వరకూ నిజమే ననుకోండీ... కానీ, మీకూ అతను నచ్చాలి కదా!" అంటూ ఇంకా ఏదో నాన్నబోయాడు.

అతనికా ఇబ్బంది తప్పిస్తూ మధ్యలోనే అందుకుని, "మన అవసరాలకీ ఆలోచనలకీ మధ్య చాలా అంతరం ఉందని అర్థమైనపుడు, అవసరాలకి అనుగుణంగా నడుచుకోవడం మంచిది కదూ!" అంది, సడన్‌గా తెచ్చిపెట్టుకున్న అనునయింపు స్వరంతో వనజ.

ఇదేదో ఫక్తు 'పర్సనల్ స్టేట్‌మెంటు'లాగా అనిపించింది శంకరానికి. అయితే ఒక్కటి మాత్రం అతనికి స్పష్టమైంది. అవసరమైతే వనజ కాస్త లోతుగా కూడా మాట్లాడగలదని.

పై మాటలంటున్నప్పుడు వ్యక్తం చెయ్యలేని నిరాశ. నిర్లిప్తత ఏదో ఆమె కళ్లల్లో తొంగి చూసినట్లుగా అనిపించి దిగులేసింది శంకరానికి.

"అదలా వుంచండి... పోనీ... మీరతనికి నచ్చారా?" అడిగాడు శంకరం తెచ్చిపెట్టుకున్న ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ.

చిన్నపాటి చిర్నవ్వుతో సౌమ్యంగా, సూటిగా అతని కళ్లలోకి చూస్తూ, "చూసివెళ్లారు. తరువాత చెప్తార్ట!" అని సెక్షన్ వైపు అడుగులు వేసింది వనజ.

వెళ్లిపోతున్న ఆమె వైపే చూస్తూ నిలబడి పోయాడు శంకరం.

కట్నకానుకల విషయంలో ఏవైనా పేచీలుంటే తప్ప ఒక మగవాడికి నచ్చకపోవడానికి ఆమెలో ఏమి తక్కువైందో అప్పటి కప్పుడు అర్థమయ్యే విషయంగా తోచలేదతనికి.

ఒదులుగా అల్లుకున్న జడలో అప్పటిదాకా ఎలాగో పట్టుచేసుకుని కూర్చునున్న పువ్వు ఒకటి పట్టు తప్పి జారి ఆమె శరీరభాగాల్ని రాసుకుంటూ రాలి నేలపై పడింది.

చూస్తూ నిలబడున్న శంకరానికి వెంటనే వెళ్లి ఆ పువ్వుని చేతుల్లోకి తీసుకోవాలన్నంత ఆవేశం కలిగింది. ఎలాగో నిగ్రహించుకున్నాడు.

సెక్షనులోకి మలుపు తిరుగుతూ గుమ్మం దగ్గర వెనక్కి తిరిగి చూసింది వనజ.

శంకరం ఇంకా అక్కడే నిలబడి తన వేపే చూస్తూండడం ఆమెలో ఆశించిన సంతోషాన్ని నింపింది.

అమృతం గురించి శంకరం అడిగిన ప్రశ్నకు వనజ ఇవ్వాల్సిన జవాబు ఆనాటికి అలా అసందర్భంగా మిగిలిపోయింది.

## 6


తల్లి అనారోగ్యం పాలైందనీ, పరిస్థితి కొంత విషమంగానే ఉందనీ ఫోను రావడంతో, అదే రోజు సాయంత్రం తన ఊరికి ప్రయాణమై వెళ్లిపోయాడు, శంకరం సెలవు మంజూరు చేయిం చుకుని.

అంతా బాగై మళ్లీ అతను విశాఖపట్టణం చేరుకునేటప్పటికి, ఆపై పదిరోజులు గడిచిపోయాయి.

ఆఫీసులో వనజ కోసం వెదుకుతున్న కళ్లకి, అతను ఊహించని పరిణామం లాగా, ఆమె ఉద్యోగం మానేసిందన్న విషయం తెలిసి నీరసపడ్డాడు శంకరం.

కారణం... పెళ్లి సెటిలైందట! అయితే చేస్తున్న ఉద్యోగం ఎందుకు మానెయ్యా ల్సొచ్చిందో అర్థం కాలేదు శంకరానికి. అందుకా దివ్యమైన గవర్నమెంటు ఉద్యోగం, ఈ రోజులలో! వనజ లేని ఆఫీసులో ఒక్కసారిగా ఏదో ఎడారిలో నిలబడ్డ ఫీలింగు కలిగింది శంకరానికి. తమాయించుకున్నాడు.

# పుంజైన కోడిపెట్ట!



'బం'గారు కోడిపెట్ట' పాట ఓ నాడు హిట్ సాంగ్. కోడిపెట్ట పుంజుగా మారి నేడు వార్తల కెక్కింది. ఇదేమి వైపరీత్యమో అని వెటర్నరీ సిబ్బంది, తలలో 'పుంజు' ఈకలు లెక్కగట్టే వింత పరిస్థితి ఎదురైంది. పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బీహార్ జిల్లాలో మెర్లిగంజ్‌లో ఈ సంఘటన జరిగింది.

అప్పటి వరకూ గుడ్లు పెట్టే కోడి పెట్ట క్రమేపీ పుంజు లక్షణాలను సంతరించుకుంటే ఫోటోగ్రాఫర్లు దౌడు తీశారు. వెటర్నరీ సిబ్బంది రోజూ ఆ కోడి యజమాని ఇంటికి వెళ్లి మార్పులను గమనించారు. ఆ మార్పులు వస్తున్న కోడిని యిస్తే ఎక్కువ మూల్యం చెల్లిస్తామన్నా, కోడి యజమాని "అమ్మా, ఆశే!" అంటూ "ఇవ్వను పో"మ్మన్నాడు. గుడ్లు పెట్టడం మానివేసింది. పుంజులా పెట్ట వెనుక పడుతుందా అని, వెటర్నరీ సిబ్బంది ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఈ వింత పశ్చిమ బెంగాల్‌కే పరిమితమా, లేదా వేరే చోట్ల జరిగిందా అని ఆసక్తితో వెటర్నరీ అధికారి డా. పార్థసారథీఘోష్ 'నెట్'లోకి వెళితే, బీహార్‌లోని పాట్నాలో పెట్ట పుంజయిన వృత్తాంతం బైట పడింది. డాక్టర్ ఘోష్ బృందం, కోడి యజమాని వద్దకు రాజకీయనాయకుల ద్వారా రాయబారం పంపి కైవసం చేసుకునే ఉద్దేశంలో ఉన్నారు. బ్రహ్మ సృష్టికి ప్రతిసృష్టి 'కొక్కొరోకో' అంటూ జరగనుంది.

- వర్మ

## 7

ఓ నెల నాళ్ల తరువాత, పెళ్లికి ఆఫీసులో అందరినీ ఆహ్వానించడానికి వచ్చింది వనజ.

"ఉద్యోగం ఎందుకు మానేశారూ?" అడిగాడు శంకరం.

"ఈ దేశంలోనే ఉండనప్పుడు, ఇంక ఉద్యోగం ఎలా చేస్తానూ?" అంది వనజ.

"ఆఁ...?!" నోరు వెళ్లబెట్టాడు శంకరం.

"అమెరికా వెళ్లిపోతున్నాను" అంది వనజ.

"అలాగా, అమెరికా సంబంధం అన్నమాట. చెప్పారు కాదేం!" అన్నాడు శంకరం.

"అమెరికా సంబంధం అయితే నేనెంతో సుఖపడిపోతానని మా వాళ్ల నమ్మకం!" అంది అందులో తనకేమాత్రం నమ్మకం లేదన్న అభిప్రాయం ధ్వనించేలా.

"మరి మీకో...?" అన్నాడు శంకరం.

సమాధానంగా నవ్వేసి ఊరుకుంది.

ఇద్దరి మధ్యా ఒకింత మౌనం తరువాత అడిగింది వనజ "మీ అమ్మగారి ఆరోగ్యం ఇప్పుడు బాగుందా?"

బాగానే ఉందన్నాడు శంకరం.

"పెళ్లి చేసుకోకూడదూ... ఆమెకో బెంగ తీరుతుంది" అంది.

"ఆఁ...?!" మరోసారి నోరు వెళ్లబెట్టాడు శంకరం. తేరుకుని వెంటనే, "నా పెళ్లి మీద అమ్మకు బెంగేవిటీ?" అన్నాడు.

ఒక నవ్వు నవ్వి "ఏమో... ఊహించానంతే!" అంది వనజ.

ఆలోచనలో పడ్డట్టుగా అయిపోయాడు శంకరం.

"పెళ్లికి తప్పకుండా వస్తారుగా..." వెళ్లడానికి సిద్ధమవుతున్న దానిలా అడిగింది వనజ.

"ఓ తప్పకుండా. అందరూ వస్తారుగా, నేనూ వస్తాను" బదులిచ్చాడు శంకరం.

అదో రకంగా చూసింది, అదే పనిగా కాసేపు అతని వంక. ఆ చివరి మాటల్లో ఏదో అతను వ్యక్తిగతంగా నొచ్చుకున్న భావన తాలూకు గూఢార్థం కనిపించినట్లుగా.

రాలీరాలని చినుకులాగానూ పూచీపూయని పువ్వులాగానూ ఒక చిన్న మొలకనవ్వు ఆమె పెదాలపై తొణికిసలాడింది బాధగా... భారంగా.

కళ్లలో నీటి తెరో, కాదో తేల్చుకోలేకపోయాడు శంకరం.

కానీ అంతలోనే అవగతమైంది ఒక్కసారిగా. వరండాలో తామిద్దరే ఉన్నారనీ... వాళ్లిరువురి మినహా అంతా నిర్మానుష్యం అయిపోయిందనీ.

జరగరానిదేదో జరగడానికి రంగం సిద్ధమైనట్లుగా అనిపించి అయోమయంగా చూశాడామె వైపు శంకరం.

మరుక్షణం ఆమె చెయ్యి పడి అతని చెంప పేలిపోయింది.

## 8

తేరుకోవడానికి చాలాసేపే పట్టింది శంకరానికి.

రహస్యంగా తామిద్దరి మధ్య జరిగిపోయిన పని అయినా, ఆమె చెయ్యి పడ్డ చెంప చాలా రోజుల దాకా చురుక్కుమంటూనే ఉండింది శంకరానికి.

వనజ పెళ్లికి వెళ్లలేదు శంకరం.

తరువాత కొన్నాళ్లకి అమెరికా నుంచి అతని పేర ఒక ఉత్తరం వచ్చింది. అందులో నాలుగు ముక్కలే ఉన్నాయి.

"ఎందుకో అప్పుడు

ఒక్క క్షణం మిమ్మల్ని గట్టిగా తాకాలనిపించింది.

అలా తప్ప ఇంకో విధంగా వీలు కాదు గదా మరి,

అందుకని– వనజ."

ఆ నాలుగు మాటల్నే పదే పదే చదువుకుంటూ, ఒక చేత్తో వనజ చెయ్యి పడ్డ చెంపని అదే పనిగా తడుముకుంటూ, రెండో చేత్తో జుట్టు లోనికి వేళ్లు పోనిచ్చి, కుచ్చులుగా పట్టి పీక్కుంటూ కూర్చుండిపోయాడు శంకరం.

అమృతం గురించి తానడిగిన ప్రశ్నకు కూడా ఆ నాలుగు మాటల్లోనే సమాధానం చెప్పినట్లుగా అనిపించింది శంకరానికి, వనజ.

■